
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 22 జూలై 2024



సంబరంగా బోనాలు



జిల్లాలో ఆషాఢ బోనాల పండుగను ఉల్లాసంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం యాచారం మండలం చింతపట్లలో ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాన్ని జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి పాటలు పాడుతూ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. బోనాల వేడుకలో పోతురాజుల కత్తుల విన్యాసం ఆకట్టుకుంది. వీధులను మామిడి తోరణాలతో, అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యాదయ్య, శ్రీశైలం, అంజయ్య, మహేశ్, పర్వతాలు, బీరప్ప, రాజు పాల్గొన్నారు. యాచారం, జూలై 21

గురు పౌర్ణమి పూజలు

గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సాయిబాబా ఆలయాల్లో అభిషేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో అభిషేకం, హారతి, పల్లకీసేవ తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయిబాబా మూల విరాట్టులను పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సుప్రభాత సేవ, కాగడ హారతి పూజలు చేపట్టారు. పూజల అనంతరం ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 21



కడ్తాల ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలో పాల్గొన్న భక్తులు

గుంత చింత!

దెబ్బతిన్న రోడ్లతో వాహనదారుల అవస్థలు



శంకర్‌పల్లిలో బ్రిడ్జి వద్ద ప్రమాదభరితంగా మారిన రోడ్డు

జిల్లాలో హైవే, ప్రధాన, గ్రామీణ రోడ్లు గుంతలమయమై రోత పుట్టిస్తున్నాయి. అడుగుకో గుంత, గజానికో గోతులతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు సాధారణమయ్యాయి. గతుకు రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. గోతుల్లో నీరు నిలిచి గొయ్యి పెద్దదా? చిన్నదా? తెలియక వాహనం నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతర్గత రోడ్ల పరిస్థితి సైతం అధ్వానంగానే ఉంది. చిత్తడి దారులపై నడక సైతం ఇబ్బందిగా మారింది. ప్రస్తుత వర్షాలకు రోడ్లు దెబ్బతింటే.. అప్పటికే దెబ్బతిన్న రహదారులు మరింత ధ్వంసమయ్యాయి. అధికారులు, ప్రభుత్వం స్పందించి వానలు తగ్గగానే రోడ్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- ముసురు వర్షాలతో అధ్వానంగా రోడ్లు
- గోతులతో ప్రమాదకరంగా మారిన హైవేలు, ప్రధాన, గ్రామీణ రోడ్లు
- కురుస్తున్న వర్షాలతో పాడవుతున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి-అర్బన్): జిల్లాలో ఓ వైపు కంకర తేలిన రోడ్లు.. మరో వైపు గుంతలు.. ఇంకోవైపు బురద రోడ్లతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేదు. చిన్నరోడ్లు, పెద్ద రహదారులు అన్నీ అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా మారాయి. గతంలో పల్లె, పట్టణ ప్రగతి అంటూ కార్యక్రమాలు నిర్వహించినా.. రోడ్ల పరిస్థితిలో మార్పు కన్పించలేదు. వాహనదారులకు గతుకుల రోడ్లపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఇవే రోడ్లపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వెళ్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. చేవెళ్లలో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదభరితంగా మారింది. చేవెళ్ల బస్‌స్టేషన్ నుంచి వివేకానంద విగ్రహం వరకు గుంతలమయంగా మారిన రోడ్డు రోత పుట్టిస్తోంది. గ్రామాల్లోనూ రోడ్ల పరిస్థితి దారుణంగానే మారింది. శంకర్‌పల్లి బ్రిడ్జి దిగుతున్న చోట, బస్టేషన్‌కు వెళ్లే దారిలో, శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట, నవాబ్‌పేట రోడ్డు నరకాన్ని తలపిస్తోంది. చేవెళ్ల-శంకర్‌పల్లి దారిలో తంగటూరు దాటాక రోడ్డు ధ్వంసమైంది. చేవెళ్ల వయా కందాడ, వెంకటాపూర్ మీదుగా శంషాబాద్ వెళ్లే రోడ్డు పాడైంది. పామెన, ఆలూరు నుంచి తంగెడుపల్లి, ముడిమ్యాల, మల్కాపూర్, కౌకుంట్ల, అంతారం, తల్లారం గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. షాబాద్ మండలం ఎర్రోనిగూడ, అంతారం స్టేజి నుంచి బొడంపహాడ్, మన్మర్రి, అప్పారెడ్డిగూడ, నాగరగూడ చౌరస్తా నుంచి రేగడి దోస్వాడ, సంకెపల్లిగూడ నుంచి ముద్దెగూడ వరకు.. అలాగే కేశవగూడ నుంచి గొల్లూరుగూడ వరకు రోడ్డు అధ్వానంగా మారింది. నాగర్‌గూడ-హైతాబాద్ వరకు రోడ్డు గుంతల మయమే! మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ, కుమరబండ వరకు మట్టి రోడ్డు చిత్తడిగా మారింది. మొయినాబాద్ మండల కేంద్రం నుంచి పెద్ద మంగళారం, చందానగర్ రోడ్డుపై గుంతలేర్పడ్డాయి. కొత్తూరు నుంచి జేపీ దర్గా వెళ్లే రోడ్డు పాడైంది. యాచారం మండలం నందివనపర్తి నుంచి మేడిపల్లి గ్రామాల మధ్య మీర్‌ఖాన్‌పేట్ నుంచి సింగారం గ్రామాల మధ్య రోడ్డు పాడైంది. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా బీటీ తొలగించడంతో వాహనదారులు ఇబ్బంది రెట్టింపయ్యాయి. జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ఇప్పటికే ఎంఆర్ఆర్ పద్దు కింద బీటీ రోడ్ల మరమ్మతులు 118 పనులకు 98.05కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటి వరకు 53 పనులు పూర్తిచేశారు. 25.5కోట్ల వ్యయం కాగా ఇప్పటి వరకు 69.83కిలోమీటర్లు మరమ్మతులు చేపట్టారు. ఇంకా 65పనులు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అలాగే ఎఫ్‌డీఆర్ పద్దు కింద 116 పనులు 114.74కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కేవలం 37పనులు పూర్తిచేశారు. ఇంకా 79 పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వానలతో రోడ్ల గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకలతో తారు, కొట్టుకుపోతూ చిన్న గుంతలు పెద్దవవుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్లపై నీటితో గుంతలు చిన్నపాటి కుంటలనే తలపిస్తున్నాయి. వాటిల్లో వాహనాలు దిగబడి జనం ఇబ్బందులు పడుతున్నారు. ముసురు వానలు పోయిన వెంటనే రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



చేవెళ్లలో జాతీయ రహదారిపై పాడైన రోడ్డు



యాచారంలో ఇదీ పరిస్థితి

యాచారం: కురుస్తున్న వర్షాలతో యాచారం మండలంలో రోడ్లు గుంతలమయమవుతున్నాయి. మండల కేంద్రం నుంచి నందివనపర్తి రోడ్డులో గుంతలతో వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్తే గుంతల్లోని నీరు పాదచారులపై చిమ్ముతోంది. ఈ గుంతల్లో కొన్ని రోజుల క్రితమే కంకర పోయించినా మళ్లీ గుంతలేర్పడ్డాయి. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చేవెళ్లలో బురదమయంగా అంతర్గత రోడ్డు



పెద్ద మంగళారం-చందానగర్ రోడ్డు దుస్థితి

రోడ్లన్నీ ప్రమాదకరంగా మారాయి



చేవెళ్ల మండలంలో రోడ్లు గుంతల మయంగా మారాయి. పాలకులు మారుతున్నా రోడ్ల మరమ్మతులు చేపట్టడం లేదు. పాడైన రోడ్ల స్థానంలో కొత్తగా వేయడం లేదు. నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా మారింది. గుంతల రోడ్లపై వెళ్లాలంటే కష్టంగా మారింది. గ్రామీణ రోడ్లతో పాటు హైవే రోడ్లు గుంతలు పడటంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రభుత్వం రోడ్లను బాగుచేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలి.

- సుధాకర్‌రెడ్డి, వ్యాపారి, చేవెళ్ల

రోడ్లను వెంటనే బాగు చేయాలి



మా ఊరుకు గత 18ఏళ్ల క్రితం అప్పటి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు గ్రేమీవిల్లర్ వచ్చినప్పుడు కొత్తగా రోడ్డేసి ఆర్టీసీ బస్సు సర్వీసే వేశారు. కొన్ని రోజులకే బస్సును బంద్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు వేయలేదు. దీంతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో పాటు చేవెళ్ల-బీజాపూర్ హైవే రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదబరింతంగా మారాయి. ప్రజాప్రతినిధులు, పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. గుంతలుపడిన రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్లను బాగు చేయాలి.

- పి.సాయిరెడ్డి, ఇబ్రహీంపల్లి

ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నాం



శంకర్‌పల్లి చౌరస్తా నుంచి పత్తేపురం వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఏళ్ల తరబడి పరిస్థితి ఇలాగే ఉంది. పత్తేపురం-శంకర్‌పల్లి మధ్య నిర్మించాల్సిన లేన్ల రోడ్డు కోసం శంకుస్థాపన చేసి నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ అతీగతి లేదు. పత్తేపురం బ్రిడ్జి వద్ద రోడ్డు పాడైంది. అధికారులు దానికి మరమ్మతులు చేయించడం లేదు. ప్రయాణీకులకు అవస్థలు తప్పడం లేదు. వర్షం పడితే బ్రిడ్జి వద్ద గుంతల్లో వాహనాలు నిలిచిపోతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో సమస్య తలెత్తుతోంది.

- రాములు, కౌన్సిలర్, శంకర్‌పల్లి మునిసిపాలిటీ

ప్రారంభానికి కార్యాలయ భవనం సిద్ధం



ఓపెనింగ్‌కు సిద్ధమవుతున్న తహసీల్దార్ కార్యాలయం

కడ్తాల్, జూలై 21 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయం భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ నెలాఖరు వరకు భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2016లో కడ్తాల కొత్త మండలంగా ఏర్పాటైంది. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయాన్ని పాల శీతలీకరణ కేంద్రం సమావేశ భవనంలో కొనసాగిస్తున్నారు. కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 2022లో తహసీల్దార్ కార్యాలయ భవనానికి ప్రభుత్వం రూ.1.18కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులను 90శాతం పూర్తిచేశారు. మిగిలిన పనులు వారం రోజుల్లో చేయించి ప్రారంభించేందుకు తహసీల్దార్ ముంతాజ్, ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. నూతన కార్యాలయ భవనం ప్రారంభమైతే ప్రజలు, సిబ్బంది పడుతున్న ఇబ్బందులు తొలగుతాయి.



డీఎంహెచ్‌వో ఏవో షఫియొద్దీన్‌ను సన్మానిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌రావు

ఏవోగా షఫియొద్దీన్ బాధ్యతల స్వీకరణ

- సన్మానించిన డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

రంగారెడ్డి అర్బన్, జూలై 21 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా మహమ్మద్ షఫియొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏవో వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో పాలన అధికారిగా పనిచేసిన షఫియొద్దీన్ జిల్లాకు వచ్చారు. శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన షఫియొద్దీన్‌ను జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. షఫియొద్దీన్ ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో సేవలందించారు. జిల్లాలోనూ కొంత కాలం పనిచేశారు. తాను అందరికీ అందుబాటులో ఉండి అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

5.5 కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి, జూలై 21: గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని ఆదివారం శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 5.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బిమల్‌నాయక్, ఉమేష్‌మాఝి కొన్నాళ్ల క్రితం శంకర్‌పల్లికి వచ్చి తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు కొద్ది రోజుల క్రితం ఒడిశా వెళ్లారు. మాణిక్య మాఝి అనే వ్యక్తి వద్ద గంజాయి కొని శంకర్‌పల్లికి తెచ్చారు. బిమల్, ఉమేష్ ఆదివారం శంకర్‌పల్లికి చెందిన అరుణ్‌కు గంజాయి అమ్మేందుకు రాగా, పోలీసులు బీడీఎల్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. వారి వద్ద 5.5కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ముసురు వర్షం

వికారాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 9గంటల వరకు అత్యధికంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బండ మాదారంలో 11మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హైదర్‌నగర్‌లో 9.5మి.మీ, కొండాపూర్‌లో 8.8 మి.మీ, సింగపూర్ టౌన్‌షిప్‌లో 8.5మి.మీ, శంషీగూడలో 8.0మి.మీ వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 10.3 మి.మీ, కందుకూరులో 9మి.మీ, రాజేంద్రనగర్‌లో 8.8 మి.మీ, కేశంపేట్, యాచారంలో మొయినాబాద్‌లలో 8 మి.మీ, మహేశ్వరంలో 6.3మి.మీ, కొత్తూరు, షాద్‌నగర్‌లలో 6 మి.మీల చొప్పున నమోదైంది. వికారాబాద్ జిల్లా పూడూరులో 8మి.మీ, మర్పల్లిలో, కోట్‌పల్లిల్లో 7.3మి.మీ చొప్పున, వికారాబాద్, ధారూరు,నవాబ్‌పేట్‌లలో 7ఎంఎం చొప్పున, బంట్వారంలో 6.8 మి.మీ, పెద్దేముల్‌లో 6మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

భారంగా పంచాయతీల నిర్వహణ

- గ్రామ పనులకు సొంత డబ్బు ఖర్చు చేస్తున్న కార్యదర్శులు
- అప్పులపాలవుతున్న గ్రామోద్యోగులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి వేడుకోళ్లు



యాచారం, జూలై 21 : గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక కార్యదర్శులు అప్పులపాలవుతున్నారు. చెత్త ట్రాక్టర్లకు డీజిల్, స్ట్రీట్‌లైట్ల మెయింటెన్స్, పైప్‌లైన్ల మరమ్మతులు, పారిశుధ్య కార్మికులకు చెల్లింపులు, ఇతర ఖర్చులకు కార్యదర్శులు సొంత డబ్బు వెచ్చిస్తున్నారు. అయితే వారికి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో కార్యదర్శులే పంచాయతీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నిధుల్లేక చాలా పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్యదర్శులు వాపోతున్నారు. యాచారం మండలంలో 24, మంచాల 24, ఇబ్రహీంపట్నంలో 15, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 18 పంచాయతీలు ఉన్నాయి. గతంలో నిధుల వ్యవహారమంతా సర్పంచ్ నేతృత్వంలో పంచాయతీ పాలకవర్గం చూసుకునేది. ఇప్పుడు వివిధ శాఖల అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఈ అధికారులు తమ రెగ్యులర్ విధులపేనే దృష్టిసారిస్తున్నారు. పంచాయతీల నిర్వహణ భారం పూర్తిగా కార్యదర్శులపై పడింది. నిధులు ఇవ్వలేని స్పెషలాఫీసర్లు ఉన్నా ఏం ప్రయోజనమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో వివిధ పనులకు రూ.1.2లక్షల వరకు వెచ్చించానని ఓ కార్యదర్శి చెప్పాడు. తాను రూ.35వేలు సొంత డబ్బు ఖర్చు చేశానని మరో మహిళా కార్యదర్శి తెలిపారు. ఒక వేళ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను బదిలీచేస్తే ఇప్పటి వరకు పనిచేసిన గ్రామంలో తాము పెట్టిన ఖర్చులను ఇస్తారా? లేదా? అని కార్యదర్శులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీల ఖాతాల్లో నిధులు నిల్!

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వడం లేదు. రోజూ చెత్త సేకరణకు ట్రాక్టర్ వాడుతున్నారు. దానికి డీజిల్ పోయించాలన్నా పంచాయతీ ఖాతాలో డబ్బులుండడం లేదు. దీంతో చాలాచోట్ల ట్రాక్టర్ల వినియోగాన్ని తగ్గించారు. పంచాయతీల జనరల్ ఫండ్ ఖాతాలో పన్నులు, ఇతరత్రా సమకూరే నిధులు జమ చేస్తారు. ఇవి అంతంత మాత్రంగానే వసూలవుతున్నాయి. ఖర్చుతో పోలిస్తే ఈ రాబడి నామమాత్రంగా ఉండడంతో ఈ ఖాతా ఎప్పుడూ ఖాళీగానే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) ఖాతాలో జమ అవుతాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం పంచాయతీ జనాభా ఆధారంగా జమ చేస్తుంటుంది. అయితే 2024 జనవరి నుంచి ఈ నిధులు కూడా పంచాయతీలకు మంజూరు కావడం లేదు.

నా సొంత డబ్బు రూ.2.2 లక్షలు వెచ్చించా



నా సొంత డబ్బుతో రెండు 5 హెచ్‌పీ మోటార్లు కొన్నా. ట్రాక్టర్‌కు డీజిల్ కోసం, సర్పంచ్ ఉన్న సమయంలో వివిధ పనులకు చేసిన ఖర్చులు రూ.2.2లక్షల బిల్లులూ రాలేదు. ప్రభుత్వం బిల్లులిస్తుందనే ఆశతో ఉన్నా. ఒక వేళ మమ్మల్ని బదిలీ చేస్తే బిల్లుల సంగతేమిటని అగమ్యగోచరంగా ఉంది. జిల్లా అధికారులు విచారణ చేసి మమ్మల్ని ఆదుకోవాలి. బదిలీ అయినా మేం చేయించిన పనులకు బిల్లులిచ్చేలా చూడాలి.

- శ్రీనివాస్, కార్యదర్శి, తాటిపర్తి పంచాయతీ

ఏడు నెలలుగా జీతాలు ఇస్తలేరు



మాకు ఏడు నెలలుగా జీతాలు ఇస్తలేరు. జీతాలు ఇవ్వాలని కార్యదర్శిని, మాజీ సర్పంచ్‌ని అడిగితే వస్తాయని చెబుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఊరిని శుభ్రం చేస్తున్నా మాకు జీతాలు ఎందుకు ఇస్తలేరో అర్థమైతలేదు. పనులు చేయాలని అందరూ చెప్పడమే గానీ జీతాల మాటెందుకు ఎత్తుతలేరో తెలుస్తలేదు.

- లక్ష్మమ్మ, కార్మికురాలు, నానక్‌నగర్ పంచాయతీ

కార్యదర్శులు వెచ్చించిన ప్రతి పైసా చెల్లిస్తాం



గ్రామాల్లో వివిధ పనులకు పంచాయతీ కార్యదర్శులు పెట్టిన ఖర్చుల బిల్లులను వారికి ఇప్పిస్తాం. ఈ విషయంలో వారు ఆందోళన చెందొద్దు. సర్పంచ్‌లు లేకపోయినా కార్యదర్శులు, సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారు. త్వరలోనే పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రానున్నాయి.

- సాధన, డీఎల్పీవో

ముదిరాజ్‌లను తక్షణమే బీసీ-ఏలో చేర్చాలి



వికారాబాద్: స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్, జూలై 21: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అభయహస్తం మ్యానిఫెస్టోలో భాగంగా బీసీ డిక్లరేషన్‌లో వాగ్దానం చేసిన విధంగా జీవోనెంబర్ 15, 19 ఫిబ్రవరి 2009 పునరుద్ధరించాలని, ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపు మార్పునకు కట్టుబడి అతి త్వరగా పరిష్కరించాలని జిల్లా ముదిరాజ్ నాయకులు కోరారు. ఆదివారం స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధిక జనాభా గలముదిరాజ్‌లు సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నామని అన్నారు. అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిముక్ల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్కోడ నర్సింహులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బస్వాపురం, రాములు, జిల్లా జాయింట్ సెక్రటరీ సిద్దులూరు కృష్ణ, కోట్‌పల్లి మండల జనరల్ సెక్రటరీ మందుల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు లొంక నర్సింహులు ఆసంఘ నాయకులతో కలిసివెళ్లి ప్రజాప్రతినిధులను కోరారు. వికారాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యాన ఆదివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా మత్స్యకార చైర్మన్ శ్రీధర్, శాఖం రాములు, యాలాల, తాండూరు పట్టణ అధ్యక్షులు హన్మంతు, శ్రీకాంత్, టి.తిరుపతి, లొంకరాములు, జగదీష్, బంద్యప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శిథిలావస్థలో మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం

● రికార్డు సెక్షన్‌లోకి వర్షపు నీరు ● తడిసిన భూ రికార్డులు



మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం

మర్పల్లి, జూలై 21: మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉండటంతో రికార్డు సెక్షన్ గదిలో వర్షపు నీరు కురుస్తుండటంతో పురాతన రికార్డులు తడిసిపోతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములకు డిమాండ్ పెరగడంతో రైతులు, ప్రజలు ప్రతీరోజు భూ రికార్డుల కోసం కార్యాలయానికి వస్తున్నారు. రాతపూర్వకం నుంచి ఆన్‌లైన్‌లో భూ రికార్డులను నమోదు చేసినా పాత రికార్డులు మాత్రం రాతపూర్వకంగా జారీ చేస్తున్నారు. భూ వివాదాల్లో కోర్టులో ఫిర్యాదు చేయాలన్నా, పాసుపుస్తకాల్లో నుంచి భూ వివరాలు తప్పుగా నమోదైనా తప్పనిసరిగా పాత రికార్డులు అందించాల్సి ఉంటుంది. 1955 నుంచి 2016 వరకు భూ రికార్డులన్నీ రాతపూర్వకంగానే జారీ చేయడంతో పాత రికార్డులు తడిసిపోతున్నాయి. పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయలేమని, దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పాత పహణీలు జిరాక్స్ తీసి ఇస్తున్నామని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రికార్డులు తడిసిపోతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో రైతులకు భూ వివరాలు అందించేందుకు ఇబ్బందులు ఏర్పడతాయని వాపోతున్నారు. కార్యాలయం శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. రికార్డు సెక్షన్‌లో వర్షపు నీరు చేరడంతో రికార్డులపై తాడిపత్రులు కప్పుతూ కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రికార్డులు పూర్తిగా తడిసిపోకముందే చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో వర్షానికి తడిసిన రెవెన్యూ రికార్డులు

బదిలీల ప్రక్రియ పొడిగింపు

● 31 వరకు ట్రాన్స్‌ఫర్లు ● స్పష్టత లేని ఆర్డర్

తాండూరు, జూలై 21: ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును సర్కార్ పొడిగించింది. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు ఒకే చేసింది. ఈనెల 20వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ కొనసాగింది. నిషేదం మళ్లీ ఈనెల 21 (ఆదివారం) నుంచి అమలులోకి రావాల్సి ఉండగా తెలంగాణ సర్కార్ ఈనెల 31వ తేదీ వరకు చేపట్టిన బదిలీ ప్రక్రియ గందరగోళంగా మారిందని, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ జరుగలేదంటూ వివిధ విభాగాల ఉద్యోగుల ఆరోపణలతో బదిలీలు కొలిక్కిరాలేదు. దీంతో ప్రభుత్వం బదిలీ ప్రక్రియను ఈనెలాఖరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆగస్టు 1వ తేదీ నుంచి బదిలీల ప్రక్రియను నిలిపివేస్తూ నిషేదం అమల్లోకి తేవనున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఖాళీల వివరాలు సక్రమంగా చూపడడం లేదని, 40శాతం ప్రక్రియ సరిగ్గా జరగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైరవీలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ సంఘాల నేతలకు యథాస్థానంలో ఉంచరాదని, కేటాయింపులో ప్రాధాన్యతను ఇవ్వాలే తప్పా యూనియన్ లీడర్‌గా మళ్లీ యథాస్థానంలో ఉంచడంపై విమర్శలు వస్తున్నాయి.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రిన్సిపాల్‌కు స్థానం



తల్లిదండ్రులతో అవార్డు అందుకున్న నరేశ్‌రాజ్

కొడంగల్, జూలై 21: వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ స్థానం దక్కించుకున్నారు. గురుపూజోత్సవంలో భాగంగా ఆదివారం ఆన్‌లైన్‌లో వర్తి వెల్నెస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విశ్వరత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుతో పాటు ఎన్నో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్న తనకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. నరేశ్‌రాజ్‌కు విశ్వరత్న అవార్డు అందుకోవడంతో స్నేహితులు, కుటుంబసభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మోత్కూర్ వాసికి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు



రవికుమార్

దోమ, జూలై 21: మండలంలోని మోత్కూర్ గ్రామానికి చెందిన రవికుమార్ రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన గురుకుల పాఠశాలల పరీక్షా ఫలితాల్లో టీజీడీ, పీజీటీ ఉద్యోగాలు సాధించారు. మహాత్మా జ్యోతిబా పూలే పరిగిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబసభ్యులు, గ్రామస్తులు రవికుమార్‌ను అభినందించారు.



గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది

▸ తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

ఘట్‌కేసర్, జూలై 21: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్, జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడానికి తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ ఉద్యమంలో ఆయా రంగాలకు చెందిన వారు ఎంతో క్రియాశీలకంగా పని చేసినప్పటికీ గురువులు ఉద్యమానికి వెన్నుదన్నుగా పని చేశారని గుర్తుచేశారు. గురుపూర్ణిమ సందర్భంగా గురువులను సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించిన సంస్కృతి టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు, పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఆమనగల్లు, జూలై 21: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతన రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమనగల్లు సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెంటయ్య తెలిపారు. గ్రామం పంచాయతీల్లో మల్టిపర్పస్ వ్యవస్థను రద్దు చేయాలని, సిబ్బంది డ్రెస్సులు, సబ్బులు, నూనెలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు మండలాధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి పర్వతాలు, కడ్తాల మండలాధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం, తలకొండపల్లి మండలాధ్యక్షుడు జంగయ్య, కార్యదర్శి శివలీల, కోశాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బోనాలకు 'తొట్టెలు' సిద్ధం



తొట్టెల తయారీలో నిమగ్నమైన రవి రాజు

మొయినాబాద్ రూరల్, జూలై 21: ఆషాఢ మాసంలో బోనాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఎక్కడ చూసినా పండుగ వాతవరణం నెలకొంటుంది. నగర శివారు చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాల్లో నిర్వహించే బోనాల సందర్భంగా యువత తొట్టెలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామదేవతలకు సమర్పించడం ఆనవాయితీ. కాగా, బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పూర్ నుంచి మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి పదేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన రవిరాజు తొట్టెలను తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తమకు ఇదే వ్యాపారమని, బోనాలు వస్తేనే కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి ఉంటుందని తెలిపాడు. ఈ ఏడాది అంతంత మాత్రమే గిరాకీ ఉందని, ఎవరూ ఆర్డర్లు ఇవ్వడంలేదని చెప్పాడు.



వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ రాజు, వైద్యులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

మొయినాబాద్ రూరల్, జూలై 21 : ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అప్పోజిగూడ గ్రామ మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అప్పోజిగూడ గ్రామంలో నగరంలోని కామినేని ఆసుపత్రి వారు ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. గ్రామంలోని 80 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆసుపత్రి యాజమాన్యానికి రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్, నందు, శిబిరం కోఆర్డినేటర్ శ్రీధర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పు



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూలై 21: జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నాయకులు అన్నారు. జ్ఞానమాల 29వ వారం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మల్లేపోగు మల్లేశ్, ప్రవీణ్‌లు పేర్కొన్నారు. జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, సమాజ శ్రేయస్సుకు ప్రతీఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జంతుక శంకర్, కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఘట్‌కేసర్, జూలై21: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, వెంకటసాయినగర్ కాలనీల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటసాయినగర్‌లో రూ, 20లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. అన్ని కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ, బీటీరోడ్ల పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. వీధుల్లో చెత్త వేయొద్దని, పరిసరాలను కలుషితం చేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు రాష్ట్రస్థాయి అవార్డులు

ఆమనగల్లు, జూలై 21: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికైంది. లయన్స్‌క్లబ్ జిల్లా 320-ఏలో 12 అవార్డులు దక్కించుకుంది. గ్రామీణ క్లబ్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. చేపట్టిన సేవా కార్యక్రమాలకు క్లబ్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఆదివారం సికింద్రాబాద్ బాటియాగార్డెన్‌లో లయన్స్‌క్లబ్ ప్రతిభా అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ బట్టడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రంలోని వివిధ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ బృందానికి బెస్ట్ క్లబ్, బెస్ట్ బ్యానర్ అవార్డులను ప్రదానం చేశారు. అత్యుత్తమ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, అత్యుత్తమ పీఆర్‌వోగా ఎంఏ పాషాలు అవార్డులు అందుకున్నారు. మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమం నిర్వహణకు గాను చుక్కాపూర్ గ్రామానికి చెందిన జోన్ చైర్మన్ ఎ.శేఖర్‌రెడ్డికి, ఉచిత కంటి వైద్యశిబిరాలను సమర్థవంతంగా నిర్వహించిన ఎం.చంద్రశేఖర్‌కు, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న జిల్లా చైర్మన్లు అంజయ్య, రాంచంద్రారెడ్డి, సామాజిక సేవలను లయన్స్‌క్లబ్‌ను రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిపిన లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్ రెడ్డి, రమేశ్ బాబు, నరేందర్ రెడ్డిలను అభినందించి అవార్డులు ప్రదానం చేశారు. సేవా కార్యక్రమంలో, క్లబ్ అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికకు సహకరించిన సభ్యులకు, అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొరివి వెంకటయ్యలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, ఓంకారం, కసిరెడ్డి రాంరెడ్డి, అంజయ్య, అర్థం మనోహర్, భిక్షపతి, సుధీర్‌రెడ్డి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న లయన్స్‌క్లబ్ బృందం

రెవెన్యూలో భారీగా బదిలీలు



▸ తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల బదిలీ

వికారాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో భారీ సంఖ్యలో బదిలీలు నిర్వహించారు. పది మంది తహసీల్దార్లు, పది మంది నాయబ్ తహసీల్దార్లు, భారీ సంఖ్యలో సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ (సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ ఏవో జి.అమరేందర్ కృష్ణను నారాయణపేట జిల్లాకు బదిలీ చేయగా, బంట్వారం తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌ను హైదరాబాద్‌కు, పూడూరు తహసీల్దార్ యు.రమాదేవి, కోట్‌పల్లి తహసీల్దార్ పి.ఆశాజ్యోతి, కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శివశ్రీనివాస్‌లను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వి.లావణ్యను యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ చేయగా, బి.విజయకుమార్, ఎస్.పురుషోత్తం, కె.శ్రీనివాస్, ఎస్.సంధ్య, వై.వెంకటేష్‌లను తిరిగి ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఫర్హీన్‌ఖాటూన్, సెబాసుల్తానాలను జిల్లాకు కేటాయించారు. జనగాం జిల్లా నుంచి సి.అంజయ్య, నారాయణపేట్ నుంచి నియామత్ అలీ, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి భరత్‌గౌడ్, వనపర్తి జిల్లా నుంచి జి.బాల్‌రెడ్డి బదిలీపై వికారాబాద్ జిల్లాకు రానున్నారు. నాయబ్ తహసీల్దార్లలో కె.రవి, లక్ష్మణ్, పి.కిరణ్‌కుమార్, కె.రమేష్‌కుమార్, వి.విజయ్, ఉప్పు రమేష్, టి.వెంకటయ్య, ఎ.రాజేష్‌లను హైదరాబాద్ జిల్లాకు బదిలీ చేయగా, సీహెచ్ఎస్ మల్లికార్జునరావును మేడ్చల్ మల్కాజ్‌గిరి, టి.రాజేందర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వీరి స్థానంలో హైదరాబాద్ నుంచి షేక్ రషీద్ అహమ్మద్, మహమ్మద్ యూనస్, బండారు శ్రీనివాస్, కె.అజయ్‌కుమార్, పి.దీపక్‌రావు, చంద్రశేఖర్, ఎస్.నవీన్‌కుమార్, జిల్లపల్లి సందీప్, హెచ్.రాకేష్‌కుమార్, ఎం.నరేష్‌గౌడ్, కిరణ్ కుమార్‌లను జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు...

జిల్లాలోవిధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లలో చాలా వరకు అందరినీ హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పి.నారాయణరెడ్డి, ఎస్.వి జయభాస్కర్, వి.మోహన్, రాజురెడ్డి చర్ల, ఎన్.తులసీరాం, ఎస్.వెంకటగిరి, బి.మమత, నల్లోళ్ల రాజు, సి.రవీందర్‌రెడ్డి, కేటావత్ రాజేందర్, పి.శ్రీకాంత్, శృతి, గిరిధర్ గోపాల్, బాలయ్య, పి.కరుణాకర్, ఎం.బాల మహేశ్వర్‌రావు, జె.దశరథ్‌సింగ్, సర్వే వివేకాందరావు, బి.రాకేష్, ఎస్.శివప్రసాద్, ఎ.సుశీల్ సాయికుమార్, బి.చంద్రమోహన్‌లను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. రాజు, నీరటి రమేష్‌లను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయగా, ఊట్కూరి శివానిని సంగారెడ్డి జిల్లాకు కేటాయించారు. జిల్లా నుంచి బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్ల స్థానంలో చాలా వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు రానున్నారు. పి.మోహన్‌రావు, ఎన్.శివకుమార్, టీ సీహెచ్ సిమ్రిన్ షఫేలీ, ఎం.పింకీ ఫ్లోరా, కె.నారాయణరెడ్డి, కొత్తపల్లి శ్రీకాంత్, పీవీఎల్ కిరణ్‌కుమార్, సి.వంశీకృష్ణ, జె.హరీష, సెల్వనైగాం ఫ్రాన్సిస్, జె.ప్రదీప్‌కుమార్, బి.అశ్విని సాయిలీలా, ఫర్హా మహమూద్, బి.సునీల్ కుమార్, ఎం.రిచర్డ్ సైమన్, కప్పు సవిత, టి.రాజు, ఆర్.సంజయ్‌కుమార్, మహమూద్ ఓవైసీ అలీ, పి.విష్ణువందన, కమలాకుమారిలను హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాకు కేటాయించారు.

బదిలీలపై అసహనం...

గతంలో ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న కిందిస్థాయి ఉద్యోగులను బదిలీచేయడం చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ శాఖలో ముఖ్యంగా భూవివాదాలు, సమస్యలపై నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లకు క్షేత్రస్థాయి అనుభవం ఉంటుంది. జిల్లాలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను చాలా వరకు బదిలీ చేయడంతో వారి స్థానంలో ఎక్కువగా ఇక్కడకు హైదరాబాద్ నుంచి బదిలీ చేశారు. వచ్చే రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు స్థానిక సమస్యలను అవగాహన చేసుకుని సమస్యలపై దృష్టి సారించే వరకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ప్రాధాన్యతాప్రకారం తాము కోరుకున్న స్థానాలను కాకుండా ఉన్నతాధికారుల నిర్ణయాధికారం మేరకే బదిలీలు చేశారంటూ పలువురు నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తమ ఇష్టానుసారంగా కాకుండా మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి ఉంటే తమకు అనుకూలంగా ఉండే జిల్లాలను ఎంపిక చేసుకుని ఉండేవారమని చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఇష్టానుసారంగా కాకుండా మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి.. ఏ జిల్లా ఎంచుకోవాలనేది ఉద్యోగులకు అవకాశం ఇచ్చి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీపై అయోమయం

▸ బ్యాంకులకు వెళ్లి రైతుల ఆరా



మేడ్చల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రుణమాఫీపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. వాటికి సమాధానం చెప్పే వారు లేక రైతులు బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రుణమాఫీ చేయడానికి వీలుగా ప్రభుత్వం రూపొందించిన ఉత్తర్వుల మేరకు పట్టాపాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు తొలివిడతలో రూ.లక్ష వరకు మాఫీ డబ్బులు జమకావాలి. కానీ బ్యాంకులు పంపిన జాబితాలో ఉన్న రైతుల్లో చాలా మందికి మాఫీ సొమ్ము జమకాకపోవడంపై గందరగోళం నెలకొంది. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కుటుంబం మొత్తం తీసుకున్న పంటరుణం లక్షకు పైగా దాటి ఉన్న రైతులకు తొలి విడత జాబితాలో చోటు దక్కలేదు. 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువల్ అయిన రుణాలకు 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం బ్యాంకర్లను కోరింది. రైతులు తీసుకున్న పంట రుణమాఫీ అవుతుందా? లేదా..? అసలు, వడ్డీ కలిపి ఎంత ఉందనే సమాచారాన్ని సైతం బ్యాంకులు రైతులకు ఇవ్వడం లేదు. అడిగితే చెప్పడం లేదని రైతులు అంటున్నారు. జిల్లాలోని పూడూరు, ఘట్‌కేసర్, అల్వాల్ సొసైటీలకు చెందిన రైతులకు ఆడిట్ కారణంగా ఇంకా రుణమాఫీ కాలేదు. పూడూరు సొసైటీలో 114, ఘట్‌కేసర్ సొసైటీలోని 1190, అల్వాల్ సొసైటీలోని 1400 మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు మాత్రం ఆడిట్ పూర్తయ్యే వరకు వారి ఖాతాల్లో నిధులు జమకావని చెబుతున్నారు. రుణమాఫీకి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు వీలుగా వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయాధికారులు పరిశీలించేందుకు ఆన్‌లైన్‌లో యాక్సిస్‌కు అవకాశం ఇచ్చారు. రూ.లక్షలోపు ఉండి రుణమాఫీ రాని రైతులు ఎందుకు రాలేదనే విషయాన్ని తెలుసుకోవచ్చని ఆధార్ నెంబరు చెబితే సరిపోతుందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతం బాధ్యత మనదే

▸ ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వత్ రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 21 : పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్నదని, విద్యారంగ ప్రమాణాలు పెంచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించిందని, అనేక సమస్యలు సాధించిందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, ఎంఈవో, డిప్యూటీ డీఈవో పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడుతానని అన్నారు. సమస్యల సాధనకు సంఘాలన్నీ కలసిరావాలని పిలుపునిచ్చారు ప్రస్తుత విద్యారంగంలోని అనేక సమస్యలను ప్రస్తావించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం పట్ల ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, బదిలీ అయి రిలీవ్ కాని టీచర్లను ప్రత్యామ్నాయ పద్ధతులతో వెంటనే రిలీవ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను సత్వరం విడుదల చేయాలన్నారు. ప్రతీ పాఠశాలలో సర్వీస్ పర్సన్లను నియమించి పాఠశాల పరిశుభ్రతను కాపాడాలన్నారు. 40 శాతం ఫిట్ మెంట్‌లో నూతన పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి సదానందం గౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండు రంగారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, వీరమణి, రాజమణి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏవీ సుధాకర్. రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాతంగి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాల నర్సింహులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబల్ నాయక్



కేశంపేట, జూలై 21: లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ పంచాయతీ పొడగుట్టతండాకు చెందిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు ముడావత్ రాంబల్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ రాష్ట్ర కార్యకవర్గాన్ని హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ప్రకటించారు. రాంబల్‌నాయక్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ 19 మందితో కార్యవర్గాన్ని ప్రకటించారు. 1997 నుంచి రాంబల్ నాయక్ లంబాడ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో లంబాడీల హక్కుల కోసం తండాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తనను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లంబాడీల హక్కుల సాధన కోసం మరింతగా పనిచేసే అవకాశం తనకు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు.



విశ్వేశ్వర్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింగ్‌రావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

▸ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, జూలై 21: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించినందుకు ప్రత్యేక శ్రద్ధతో గ్రామాల్లో ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. శనివారం రాత్రి మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయడంతోనే తాను ఎంపీగా భారీ మెజార్టీతో గెలవగలిగానన్నారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు.

ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నర్సింగ్‌రావు

శనివారం రాత్రి హిమాయత్ నగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎస్సీ మోర్చా అభివృద్ధి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే విషయమై నాయకులు చర్చించారు. అనంతరం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన అంతంగారి నర్సింగ్‌రావును బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ పెద్దలకు నర్సింగ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు మోర నర్సింహారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయం వద్ద వివరాలను వెల్లడిస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

తాండూరు, జూలై 21: విద్యాశాఖలో సమగ్రశిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్లగా అందుబాటులో ఎమ్మెల్యే లేకపోవడంతో అక్కడి ఉద్యోగులకు వినతిపత్రాన్ని అందజేసి వివరాలను అందజేశారు. సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు బేసిక్ పే కల్పించాలన్నారు. జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షలు సౌకర్యం కల్పించాలని పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరిగానే 12నెలల వేతనం ఇవ్వాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో ఎమ్మెల్యేను కలిసి డిమాండ్లను ప్రభుత్వం వద్ద చర్చించాలని కోరుతామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జేఏసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మోహన్ సింగ్, అధ్యక్షుడు కె.గంగ్యానాయక్, మహిళ విభాగం అధ్యక్షురాలు డి.స్వప్నరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు

ఘట్‌కేసర్, జూలై 21: రాష్ట్రంలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఆటోయూనియన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో కార్మికులకు ప్రతీనెల ప్రభుత్వ ఇస్తానన్న రూ.12,500భృతిని చెల్లించి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, శ్రీనివాసులు, లొట్టి ఈశ్వర్, యాకుబ్‌పాషా, జంగయ్య, మంకయ్య, నరేష్, నవీన్, నర్సింహ, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్/కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్/పూడూరు/కులకచర్ల/పెద్దేముల్, జూలై 21: రైతుబీమాకు జూన్ 28, 2024 నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల వివరాలు మండల వ్యవసాయశాఖకు అందినట్లు ఏవో ఎంఏ బాసిత్ కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు రాజురాథోడ్, అనురాధ, పూడూరు మండల వ్యవసాయాధికారి, కులకచర్ల ఏవో వీరస్వామి, పెద్దేముల్ మండల వ్యవసాయాధికారి నజీరుద్దీన్‌లు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 2024-2025 సంవత్సరానికి గాను రూ.5లక్షల బీమా చేసుకోని రైతులు ఈ ఏడాది చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల్లోపు గల రైతులు ఆగస్టు 5వ తేదీలోపు సంబంధిత ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతుబీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డ్, నామినీ ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు ఇప్పుడు చేసుకోవద్దని సూచించారు. 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో జన్మించిన వారు మాత్రమే రైతుబీమాకు అర్హులని తెలిపారు.



పాంబండ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పాంబండ గిరి ప్రదక్షిణ

కులకచర్ల, జూలై 21: మండలంలోని పాంబండ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రతీ పౌర్ణమి రోజు ఇక్కడ హిందూ బంధువుల ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం వర్షం కురుస్తున్నా గురుపౌర్ణమి సందర్భంగా పాంబండ 19వ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- ఘనంగా సాయి సామూహిక వ్రతాలు
- భక్తులతో బాబా ఆలయాలు కిటకిట
- పాల్గొన్న ప్రజాప్రతిధులు, నాయకులు



మొయినాబాద్ రూరల్ : చిలుకూరు బాలాజీ సేవలో పాల్గొన్న అఖిలేష్ కుమార్ ఝా కుటుంబ సభ్యులు, తదితరులు





శంషాబాద్ : సత్సంగంలో పాల్గొన్న భక్తులు, పూజ చేస్తున్న బాలానందదాసు



యాచారం : రామాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆమనగల్లు, జూలై 21: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని పచ్చటి తోరణాలు, రంగురంగుల పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన సాయి భక్తులు గురుపౌర్ణమి వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సాయినామస్మరణతో ఉదయం నుంచి రాత్రి వరకు సాయిబాబా ఆలయం మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు బి.మధుసూదనశర్మ, రవికిరణ్, పాలాది ఆంజనేయులు, పాపిశెట్టి రాముల ఆధ్వర్యంలో విశాల వసతులు ఏర్పాటుచేశారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారికి మేలుకొలుపు పాడారు.అనంతరం సాయిబాబా మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో శోభాయామానంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సామూహిక వ్రతాలు నిర్వహించారు. మహిళలు, దంపతులు వ్రతాలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు మధుసూదనశర్మ, రవికిరణ్, కార్తీక్, కౌశిక్, నయనాచారి, నాయకులు, నిర్వాహకులు శ్యామ్‌సుందర్, రామకృష్ణ న్‌రాజు, లక్ష్మణ్, పాపిశెట్టి కుమార స్వామి, వెంకటేశ్, గోల్డ్ రాము, మూర్తి, నారాయణ, సాయిబాబా, రామ్మోహన్, రామకృష్ణ, తదితరులున్నారు.



చేవెళ్ల : దత్తాత్రేయ స్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

కడ్తాల్ : మండల కేంద్రంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. షిరిడీ సాయి, సత్యసాయి మందిరంలో నిర్వహించిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు వెంకటేశ్వర శర్మ, నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ అధ్యక్షుడు చెన్నకిషన్ రెడ్డి, మిరియాణం మల్లప్ప, గూడూరు బాల్‌రెడ్డి, రాఘవాచారి, మహిళలు పాల్గొన్నారు. అదే విధంగా ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యానాయక్‌లు కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సందర్శించారు. మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, బాలరాజు, జవహర్‌లాల్‌నాయక్, తులసీరామ్‌నాయక్, మల్లేశ్ గౌడ్, తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు : గురుపౌర్ణమి వేడుకల్లో ఆకట్టుకున్న మహిళల దాండియా

యాచారం : మండలంలోని యాచారం, చౌదర్‌పల్లి గేటువద్ద గురుపూర్ణిమ జరుపుకున్నారు. రామాలయంలో భక్తులు హోమం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌదర్‌పల్లి గేటు వద్ద సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు. నగరం నుంచి పలువురు భక్తులు వచ్చి స్వామి వారికి పూజలు చేశారు.



శంషాబాద్ రూరల్ : సతీశ్‌నాయర్ గురుస్వామికి నివాళులర్పిస్తున్న శిష్యులు

శంషాబాద్ రూరల్ : గురుపౌర్ణమిని పురస్కరించుకొని. పాలమాకులలో ప్రముఖ అయ్యప్ప భక్తులతో పాటు తెలంగాణ ఇతర ప్రాంతాల్లోని ఎంతోమందిని ఆధ్యాత్మికం వైపు నడిపించిన గురుబ్రహ్మ శ్రీశ్రీ సతీష్ నాయర్ శిష్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. మాజీ ఎంపీటీసీలు ఉమ్లానాయక్, గుడాల కృష్ణ, చెక్కల ఎల్లయ్య, వీరమల్లేశ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఆలయాల్లో గురుపౌర్ణమి పూజా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ధర్మగిరి ధర్మసాయి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. గౌతపురంలో సత్సంగం, శ్రీ విజయలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో సుప్రభాతసేవ, అభిషేకం, గురుపూజ, గరుడవాహనసేవ, గురువుగారి పల్లకీసేవ, గురుపాదుకా పూజామహోత్సవాలు నిర్వహించారు. దేవాలయ పీఠాధిపతి హరిబాలానందదాసు సత్సంగం చేయగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : మానసిక ప్రశాంతత ఆలయాల్లోనే లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు మాడి రాంరెడ్డి అన్నారు. మండలంలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఉన్న సాయిబాబా దేవాలయం, హిమాయత్ నగర్‌లోని సాయిబాబా దేవాలయాలను సర్వంగసుందరంగా తీర్చిదిద్దారు. వేద పండితుల సమక్షంలో ప్రత్యేక హోమాలు, యజ్ఞాలను చేయించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్ సాయిబాబా దేవాలయం కమిటీ చైర్మన్ మాడి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎల్‌ఐసీ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ చారి, కమిటీ సభ్యులు మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంచె శ్రీనివాస్ యాదవ్, హిమాయత్ నగర్‌లో ఆలయ కమిటీ చైర్మన్, మొయినాబాద్ మాజీ ఎంపీపీ ముదిగొండ అనిత శ్రీహరి యాదవ్, కంజర్ల ప్రకాష్, ముదిగొండ రవియాదవ్, ముదిగొండ రాఘవేందర్ యాదవ్ గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. అలాగే చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామిని ఆర్మీ మేజర్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్, ఐపీఎస్ అధికారి అఖిలేష్ కుమార్ ఝా ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, ఆశీస్సులు అందించారు. స్వయంభూ అయిన బాలాజీ స్వామి వారి ఆలయంలో కలియ తిరుగుతూ ఆలయ విశిష్టతను రంగరాజన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్మీ సిబ్బంది ఉన్నారు.

చేవెళ్ల : చేవెళ్ల పట్టణ కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలో ఉన్న సాయిబాబా మందిరం, సత్యసాయి మందిరంలో వేర్వేరుగా పూజలు చేశారు. సత్యసాయి మందిరంలో దంపతులు పూజలు చేసి పల్లకీసేవ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, సత్యసాయి మందిరం కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు తదితరులు ఉన్నారు. అలాగే కర్ణాటకలోని ఘణగాపూర్‌లో నెలకొన్న దత్తాత్రేయ స్వామివారిని ఎమ్మెల్యే యాదయ్య దర్శించుకున్నారు. స్వామివారి పల్లకీసేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

శంకర్‌పల్లి : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. సాయికాలనీలో గల సాయిబాబా దేవాలయంలో అభిషేకం, హారతితో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నరోత్తంరెడ్డి, రవిందర్‌రెడ్డి, మైపాల్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : సాయిబాబా ఆలయంలో పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు



మొయినాబాద్ రూరల్ : సాయిబాబా ఆలయంలో పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి

క్రైం కార్నర్

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

- మహిళకు తీవ్ర గాయాలు

యాచారం, జూలై 21 : ఆగి ఉన్న వాహనాన్ని(ఇటాచీ) బైక్ ఢీకొనడంతో వ్యక్తి మరణించగా ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మండలంలోని తమ్మలోనిగూడ గేటు వద్ద శనివారం రాత్రి జరిగింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల మల్లేష్ (24) అతని వదిన అనసూయలు నిత్యావసర సరకుల కోసం మాల్‌లోని ఓ దుకాణంలో కొనుగోలు చేసి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. ఈక్రమంలో తమ్మలోనిగూడ గేటు వద్ద ఆగి ఉన్న ఇటాచి వాహనాన్ని బైక్ ఢీకొనడంతో మల్లేష్ తీవ్రంగా గాయపడగా అనసూయ తీవ్రంగా గాయపడింది. అటుగా వస్తున్న వాహనదారులు పోలీసులకు సమాచారమందించారు. అంబులెన్స్‌లో ఇబ్రహీంపట్నం తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. కాగా, అనసూయకు పక్కటెముకలు విరిగాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

కుక్కల దాడిలో లేగదూడ మృత్యువాత

చౌదరిగూడ, జూలై 21 : కుక్కల దాడిలో లేగ దూడ మృతిచెందింది. మండల పరిధిలోని తూంపల్లి గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు పొలం వద్ద దూడపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే చనిపోయింది. ఆదివారం మధ్యాహ్నం కుక్కలు మరో ఆవుపై దాడిచేసి గాయపరిచినట్లు రైతు వాపోయాడు. తరచూ పిల్లలు, పెద్దలపై కుక్కలు దాడి చేసి కరవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేకసార్లు కుక్కలు దాడి చేయడంతో పశువులు చనిపోయిన సంఘటనలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా షాపు దగ్ధం



శంకర్‌పల్లి, జూలై 21: అంతప్పగూడ చౌరస్తాలోని ఓ కిరాణ దుకాణం షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. షాపులోని సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. యజమాని వెంకటేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంతప్పగూడ చౌరస్తాలో కొన్నాళ్ల క్రితం షాపును అద్దెకు తీసుకొని కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే శనివారం రాత్రి దుకాణానికి తాళంవేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం దుకాణం లోపలి నుంచి పొగ రావడం గమనించిన స్థానికులు.. వెంకటేష్‌గౌడ్‌కు సమాచారమిచ్చారు. వెంటనే వచ్చి షాపు తెరిచి చూడగా అందులోని సామగ్రి, వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. షార్ట్‌సర్క్యూట్‌తోనే దుకాణం కాలిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వెంకటేష్‌గౌడ్ కోరుతున్నాడు.

ప్రమాదకరంగా గొయ్యి



కేశంపేట మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కేశంపేట-లేమామిడి ప్రధాన రహదారిపై బొదునంపల్లి శివారులో గొయి ఏర్పడింది. ఈ మార్గాన్ని రెండు లేన్ల బీటీ రోడ్డుగా ఇటీవల నిర్మించారు. అయితే, పనుల్లో నాణ్యత లోపించడంతోనే గొయ్యి ఏర్పడిందని ప్రయాణికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. బొదునంపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు నిర్మాణంలో సైతం లోపం ఉందని, దాంతో బీటీ రోడ్డు దెబ్బతినడంతో పాటు, రోజురోజుకూ కోతకు గురౌతుందని తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - కేశంపేట, జూలై 21

రోడ్డు పనులను పూర్తి చేయించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న వినయ్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్, జూలై21: బాకారం జాగీర్ గ్రామం వరకు వేయాల్సిన బీటీ రోడ్డును ఎన్కేపల్లి గ్రామం వరకు మాత్రమే వేసి బాకారం వరకు వేయకుండా అధికారులు నిర్లక్ష్యంతో అసంపూర్తిగా వదిలేశారని, బాకారం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో బాకారం జాగీర్ గ్రామస్తులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హిమాయత్ నగర్ చౌరస్తా నుంచి బాకారం జాగీర్ గ్రామం వరకు (వయా) ఎన్కేపల్లి రోడ్డు నిర్మాణ పనులకు అప్పట్లో నిధులు మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. పనులు చేపట్టి ఎన్కేపల్లి వరకు మాత్రమే పూర్తిచేసి బాకారం వరకు పనులు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని పేర్కొన్నారు. దీంతో వర్షం ధాటికి రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్కేపల్లిలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం ఉండడంతో.. అప్పట్లో అధికారులు ఆగమేఘాల మీద ఎన్కేపల్లి వరకు మాత్రమే రోడ్డు వేశారని పేర్కొన్నారు. త్వరలో అధికారులతో మాట్లాడి రోడ్డు పనులను పూర్తి చేయిస్తానని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వినయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, అశోక్, రమేష్, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు రుణమాఫీపై అభినందన సభ

యాచారం, జూలై 21 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ ప్రకటన సందర్భంగా నేడు(సోమవారం) యాచారం మండల కేంద్రంలో అభినందన సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వివిధ గ్రామాల రైతులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు



శంకర్ నాయక్ సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్, జూలై 21: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, గిరిజన నేత బాణావత్ శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కడ్తాల మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ నాయకులు, గిరిజన నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాయకులతో కలిసి శంకర్ నాయక్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలుచోట్ల మొక్కలు నాటారు. మండల కేంద్రంలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. శంకర్ నాయక్‌ను పలువురు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యనాయక్, నాయకులు రాజు నాయక్, పాండు నాయక్, లక్ష్మణ్ నాయక్, జాన్య నాయక్, మహేశ్ నాయక్, వినోద్, ముణేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ బోనాలు



ఇబ్రహీంపట్నం : మహంకాళి ఆలయం వద్ద భక్తుల సందడి, వర్షంలోనే బోనాలతో తరలి వస్తున్న మహిళలు

శంషాబాద్, జూలై 21 : బోనాల ఉత్సవం ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పలు దేవాలయాల్లో జరిగిన బోనాల ఉత్సవంలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. స్థానిక నాయకులు ఆర్.గణేశ్, డి. వెంకటేష్ గౌడ్, నీరటిరాజు, మల్లారెడ్డి, మేకల వెంకటేష్, వై.కుమార్, కవిత, ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, స్రవంతి, ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, జెల్‌పల్లి శ్రీనివాస్, తోటరాములు, సురేష్‌గౌడ్, నగేష్, జంగయ్య హనుమంత్, బంటి, శ్రీకాంత్‌యాదవ్, భాగ్యలక్ష్మి, సంతోష్‌రెడ్డి, పవన్, నర్సింహ తదితరులున్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మధురానగర్, పోచమ్మ బస్తీ, అంగడి బజార్, శివాజీ బస్తీ, హనుమాన్ బస్తీ, కట్టమైసమ్మ, సిద్దాంతి, హుడాకాలనీ, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీ, రాళ్లగూడ, ఇందిరానగర్, ఆర్బీనగర్, ఆదర్శనగర్ తదితర బస్తీల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ బస్తీలకు చెందిన మహిళలు కొత్త కుండను పసుపు, కుంకుమలతో అందంగా దిద్ది, అమ్మవారి కోసం ప్రత్యేకంగా తయారుచేసిన నైవేద్యంతో ఊరేగింపుగా తీసుకెళ్లి.. పోచమ్మ, కట్టమైసమ్మ, కోటమైసమ్మ, రేణుకాఎల్లమ్మ తదితర గ్రామదేవతల ఆలయాల్లో సమర్పించారు. అనంతరం మొక్కుకొని చెల్లించుకున్నారు. సిద్దాంతి బస్తీలో హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి పక్కన గల కట్టమైసమ్మ దేవాలయం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా, భక్తులకు ప్రమాదాలు జరగకుండా పోలీసులు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాళ్లగూడ బస్తీలో కొత్తగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో తొలిసారి భక్తులు బోనాలు సమర్పించారు. ఉత్సవంతో ఘటాల ఊరేగింపు సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఆర్జీఐఏ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.



శంషాబాద్ : బోనాలు ఎత్తుకొని దేవాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్న మహిళలు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం టౌన్‌లో మహంకాళి బోనాల ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. వర్షం కారణంగా ఎవరికివారే బోనాలతో ఆలయానికి వచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది.



శంషాబాద్‌లో జరిగిన ఉత్సవంలో పోతురాజుల విన్యాసాలను తిలకిస్తున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల/శంకర్‌పల్లి : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీలు యాదమ్మ, నరేందర్‌చారి, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిల్చింది. అలాగే శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో బోనాల వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా కౌన్సిలర్ శ్వేతా పాండు రంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : దేశం మరింత అభివృద్ధి చెందాలని పోచమ్మ దేవాలయాల్లో పూజలు నిర్వహించినట్లు చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్‌లోని పోచమ్మ దేవాలయంతో పాటు వివిధ బస్తీల్లోని ఆలయాల్లో బోనాల ఉత్సవా ల్లో ఆయన పాల్గొన్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం మరింతగా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్టు తెలిపారు. బీజేపీ జిల్లా నాయకుడు నందకిషోర్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డిలతో పా టు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శంషాబాద్ : వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి



చేవెళ్ల : ఆలూర్‌లో నిర్వహించిన బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

కొనసాగుతున్న కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, జూలై 21: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరం మూడోరోజు ఆదివారం కొనసాగింది. వెల్దండ ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెన్నై శంకర నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈనెల 27వరకు శిబిరం కొనసాగుతుందని ఫౌండేషన్ డైరెక్టర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. కంటి శుక్లాలు ఉన్న వారికి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రచ్చ శ్రీరాములు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, అభినవ్ రెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

షాద్‌నగర్ రూరల్, జూలై 21: షాద్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయడానికి కష్టించి పని చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య తెలిపారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన విఠ్యాల నర్సింలును ఆదివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ మోర్చాను బలోపేతం చేయడానికి అందరినీ సంఘటితం చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో షాద్‌నగర్‌లో కాషాయ జెండా ఎగురవేయడానికి సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, శంకర్ నాయక్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



నర్సింలును సన్మానిస్తున్న అందె బాబయ్య

ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

ఆమనగల్లు/శంకర్‌పల్లి, జూలై 21: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డీసీసీ కార్యదర్శి బీక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బాలరాజు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణు, హన్మనాయక్, జహంగీర్‌బాబా, తదితరులు పాల్గొన్నారు. ఖర్గే జన్మదిన వేడుకలు శంకర్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి ఖర్గే చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. నాయకులు ప్రభు, శ్రీశైలం, సంజీవ, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.